**పరిశోధక విద్యార్థి:**
గాండ్ల గోపాల్
రీసెర్చ్ స్కాలర్ **BESTIU,**
లెక్చరర్ ఇన్ తెలుగు,
ఎస్.ఆర్.ఎస్.కె.
ప్రభుత్వ డిగ్రీ కళాశాల , బాన్సువాడ.

పర్యవేక్షకులు:
డాక్టర్ ఎం దేవేంద్ర
రీసెర్చ్ సూపర్వైజర్,
అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆఫ్ తెలుగు,
చాకలి ఐలమ్మ యూనివర్సిటీ,
హైదరాబాద్.

# సమాజ ఉన్నతిలో భజనకీర్తనల ఆవశ్యకత

(పరిశోధన వ్యాసం )

## 1.విషయ సంగ్రహం:-

మానవ జీవన క్రమ పరిణామ వికాసంలో, ఎన్నో అంశాలు దోహదపడ్డాయి. జనచైతన్యాన్ని కాంక్షించి, మరెన్నో ఉద్యమాలు చేయూతనిచ్చాయి. అలాంటి వాటి అన్నింటిలో కెల్లా, భక్తి ఉద్యమం అత్యంత ప్రధానమైనది అని చెప్పవచ్చు. మనిషి దైనందిన జీవితంలో భాగమై, అనుక్షణం కంటికి రెప్పలా కాపాడుతూ, తన ఉనికికి, అస్తిత్వానికి ఏమాత్రం భంగం వాటిల్లకుండా, ఆధ్యాత్మిక చింతన వైపు నడిపింప సాగింది భక్తి ఉద్యమం.

ఇందులో భాగంగా, భక్తి ఉద్యమం నేపథ్యంగా అనేక రకాల పద్ధతులు వెలుగులోకి వచ్చాయి. అలాంటి వాటిలో ప్రవచనాలు, ఆధ్యాత్మిక సంస్థలు, మఠాలు, సత్రాలు, వంటివి. ఇందులో ప్రధానంగా చెప్పుకోదగింది భజన కీర్తనలు, తత్వాలు. ఇవి తెలుగు నేల మొత్తాన్ని పరమ భావనం చేశాయి, చేస్తున్నాయి అనడంలో ఏమాత్రం సందేహం లేదు.

ఏళ్ల తరబడి సమాజాన్ని అంటివిడవకుండా కల్లోలాలను సృష్టిస్తూ, మనిషిని అధోగతి పాలు చేస్తున్న త్రిగుణాలు, అష్ట మదాలు, అరిషడ్వర్గాలు, వీటిని సమూలంగా తుడిచి వేయడానికి, నిరంతరం తపిస్తూ తమ వంతు కర్తవ్యాన్ని నిర్వర్తిస్తున్నాయి భజన కీర్తనలు.

ముందు తరం నుండి గనుక పరిశీలిస్తే, అన్నమయ్య, త్యాగయ్య, క్షేత్రయ్య, భక్త రామదాసు, కబీర్ దాసు, సూరదాసు, రాకమచర్ల వెంకట దాసు, ఈగబుచ్చిదాసు వంటి సంకీర్తనకారులు భక్తి ఉద్యమాన్ని చైతన్య పరుస్తూ, భజన కీర్తనలను విరివిగా జనంలోకి తీసుకు వెళ్తూ, జాతిని జాగృతం చేయడంలో ఎంతో దోహదపడ్డారు. వారు జీవించినంత కాలం ఆధ్యాత్మికతయే పరమావధిగా భావించి, వారి జీవితాలను అంకితం చేసి ఈనాటికి చిరస్మరణీయులుగా నిలిచినారు.

## 2.ఉపోద్ఘాతం:-

భజియించడం అంటే తనకు నచ్చిన దైవాన్ని గాని, గురువును గాని నిరంతరం స్మరించడమే భజన. అలాంటి స్మరణను, లేదా స్తుతిని, భక్తి తత్వాన్ని ఉట్టిపడే విధంగా దైవ జీవితంలో అంతర్లీనమయ్యే విధంగా, ధ్యానముద్రలో, శృతిబద్ధంగా రకరకాల వాయిద్యాలను ఉపయోగించి, దైవాన్ని కీర్తించడమనేది ప్రధానం. ఇందులో దేవుని పట్ల అవ్యాజమైన ప్రేమ, అచంచలమైన భక్తి, వెల్లువెత్తే విధంగా, తన్మయత్వం చెందుతూ, పరవశంతో రకరకాల కీర్తనలను, తత్వాలను పాడడం వల్ల, వారిలో దాగిన అమలిన భక్తి బహిర్గతం అవుతుంది. అందువలననే ఇది భక్తిలో ఒక ప్రధాన మార్గం, భూమిక అని చెప్పవచ్చు. ఆధ్యాత్మిక భావజాలానికి ప్రధాన కేంద్రం అని కూడా చెప్పవచ్చు. అంతేకాకుండా పరమానంద భరితులై తన్మయత్వంతో ఎవరైతే కీర్తనల పారవశ్యంతో స్తుతి చేస్తారో, అలాంటి వాళ్ళు దైవదర్శనం కూడా పొందుతారని మనకు చరిత్ర చెబుతోంది.

ఉదాహరణకు: భక్త రామదాసు, అన్నమయ్య, త్యాగయ్య, క్షేత్రయ్య, వంటి వారు దైవకటాక్షాన్ని పొందినవారే.

## 3. విషయ వివరణ:-

ఆధ్యాత్మిక పరంపరకు ఆలవాలమై సాధనంగా వెలుగొందే మార్గం ఈ భజన కీర్తనలు. అయితే అనాది నుంచి తెలుగు నేల మొత్తం ఈ భజన కీర్తనల పరంపర నేటి అధునాతన యుగంలో కూడా ఇంకా కొనసాగుతూనే ఉన్నది. కారణం ఆయా ప్రాంతాల మాండలికాలు, పదబంధాలు, సామెతలు, నుడికారాలు, జాతీయాలు,ఉక్తులు, చలోక్తులు, ప్రజల భాషలో ప్రజలకు చేరువయ్యే ధోరణిలో ఉండడం వల్ల ఇవి బహుళ జనాదరణ పొందినవి. పొందుతున్నాయి. కూడా అయితే ఇటువంటి పరిస్థితులలో తెలుగు నేల అనే కాకుండా, మిగతా ప్రాంతాలలో కూడా ఈ సంప్రదాయం ఇంకా కొనసాగుతోంది. మహారాష్ట్ర కర్ణాటక

తదితర ప్రాంతాలలో కూడా ఈ ప్రభావం ఉంది. ముఖ్యంగా ఆయా స్థానిక క్షేత్ర మహాత్ములను దైవాలను స్తుతిస్తూ, భజన పరంపర కొనసాగడం జరుగుతుంది. అందులో భాగంగానే కొన్ని ప్రాంతాల్లో గమనించినట్లయితే పండరి భజన, విఠల భజన, శివ భజన, హరి భజన, వంటి వాటిని మనం చూడవచ్చు

**A.తాత్వికతను బోధించడమే వీటి లక్ష్యం:-**

భజన కీర్తనలలో ప్రధాన లక్ష్యం తాత్విక సందేశాన్ని లోకానికి అందజేయడమే. విషయ వాంఛలలో, సంసార సాగరంలో నిత్యం కొట్టుమిట్టాడుతున్న మనిషిని, జాగృతవస్థకు తీసుకురావడానికి ప్రేరణ భరితంగా నిలుస్తుంటాయి. ముఖ్యంగా తత్వ సాహిత్యాన్ని పెంచి పోషించిన వారిలో, మన తెలంగాణలోని ఈగబుచ్చిదాసు, రాకమచర్ల వెంకటదాసు, కొంకణం సాధువు, పీరు మొహిద్దీన్, బోరల అప్పలస్వామి, గుజ్జుల నారాయణ, నక్క రామన్న మున్నగు వారు. వారి జీవిత అనుభవంలో జరిగిన సంఘటనలను, ఎదుర్కొన్న పరిణామాలను దృష్టిలో ఉంచుకొని, దానికి తోడు ఆధ్యాత్మికత అనే దైవచింతనను అద్ది, జనరంజకమైన గీతాలను, కీర్తనలను రచించారు.

మచ్చుకు:-
చెప్పలేదంటనక పొయ్యేరు! నరులారా గురుని
చేరి మ్రొక్కితే బ్రతుకనీర్చేరు!
చెప్పలేదంటనక పొయ్యేరు
తప్పదిదుగో గురుని వాక్యము
తప్పు త్రోవల బోయవారికి
చప్పరించుక మ్రింగు శక్తులు!!......చెప్పలేదంటనక!!
——---- శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి

వంటి గీతాలు జనం హృదయంలోకి త్వరగా వెళ్లడం అనేది జరుగుతుంది. దీనిద్వారా పండితులకే గాక, పామరులకు సైతం పులకించే విధంగా ఉంటుంది.
మరొకటి:-
ఉత్తాదట జన్మాముత్తాదట! ఘనులు
తుత్తన్న మాటానే సత్యామట!
ఉత్తామా సత్వేద చెత్తాలనోర్వాకా!
తుత్తననీ వారంతా వ్యర్థాలటా!......ఉత్తాదట!!
——-------- నక్క రామన్న.

వంటి కీర్తనలను విన్నప్పుడల్లా, మానవుని జీవన విధానం ఏమిటో అర్థమవుతుంది. అంతేకాకుండా శరీరం యొక్క విలువ దానిపైన గల వ్యామోహం, మొహం మొత్తం

అర్థమవుతుంది. ఈ కీర్తనలో రచయిత తాత్విక సారాన్ని, తత్వబోధను ఎంతో గొప్పగా వివరించడం జరిగింది. ఇలాంటి కీర్తనలు తత్వాలు నేటికీ తెలుగు నేలలో కోకోళ్ళలుగా ఉన్నాయి.

**B.**పలు విధాలుగా భజన కీర్తనలు:-

భజన సంప్రదాయ పద్ధతిలో పలు రకాల పద్ధతులు ఉన్నాయి. అంతేకాకుండా పలు విధాలుగా ఈ కీర్తనలను ఆలకించడం జరుగుతుంది.

1. పారమార్థిక సంబంధమైనవి
2. తాత్విక సంబంధమైనవి
3. ఆధ్యాత్మిక సంబంధమైనవి
4. నీతి భక్తికి సంబంధమైనవి
5. గురు శిష్య బోధకు సంబంధించినవి.

ఈ తరహాలో వారికి నచ్చిన విధంగా, నచ్చిన భావనతో దైవాన్ని స్తుతిస్తూ, కీర్తించడం భజన సాంప్రదాయంలో పరిపాటి. ఒక్కో ప్రాంతంలో ఒక్కో విధంగా ఆ ప్రాంతపు జన వ్యవహారంలో గల భాషను, నుడికారాలను, పదబంధాలను ఆధారంగా చేసుకుని భజన గీతాలను ఆలపించడం జరుగుతుంది.

**4.**భజన కీర్తనల లక్ష్యాలు:-

ముఖ్యంగా గ్రామీణ పల్లె ప్రాంతాల్లో నీటికి సజీవంగా ఉన్న ఈ భజన సాంప్రదాయ పద్ధతి, గ్రామంలో ఆలయాల వద్ద లేదా ఆశ్రమాల వంటి వాటి వద్ద, ప్రధాన కేంద్రంగా మలుచుకుని, కులమతాలకు అతీతంగా, ఔత్సాహికులైన ప్రతి ఒక్కరు, ఇందులో పాల్గొని, బృందాలుగా ఏర్పడి, రాత్రుల యందు భజన కీర్తనలను పాడుతూ, తాళం, మృదంగం, చిరుతలు, మద్దెల, వీణ, హార్మోనియం, వంటి వాయిద్యాలను ఉపయోగిస్తూ, అత్యంత భక్తి పారవశ్యంతో, భజన కీర్తనలను పాడుతూ ఉంటారు.

ఇది నిజంగా ఒక గొప్ప పరిణామం. ఇందులో అనేక రకాల తెగలు మరియు జాతులకు చెందిన వారు ఉంటారు. వారు పాడే పద్యాలు గాని, కీర్తనలు గాని ఆనంద పరవశంతో భక్తిలో లీనమై పాడడం వల్ల, చూపరుల మనసు దోచుకునే విధంగా ఉండటమే కాకుండా, వారి మనసుకు ఆనందాన్ని కలిగించే విధంగా ఉంటుంది.

సనాతన భారతీయ సాంప్రదాయ పరిరక్షణయే ధ్యేయం:-

సనాతన సాంప్రదాయం నుండి దేశం యొక్క ఔన్నత్యాన్ని చాటే విధంగా, భక్తి ఉద్యమ లక్ష్యాన్ని చేరుకునే విధంగా, ఈ భజన కీర్తనలు పాడడం జరుగుతుంది. ఈ విధానాన్ని కొనసాగించడంలో ఒక ప్రధాన ఉద్దేశం లేకపోలేదు. అదేమిటంటే రాను రాను కుల, మత వివాదాలు జరుగుతున్నందున గ్రామీణ వ్యవస్థలో ప్రశాంతమైన వాతావరణం మరియు ప్రతి ఒక్కరూ ఐక్యత స్వభావం నెలకొని అవకాశం ఉంది. అంతేకాకుండా దేశం యొక్క గొప్పతనం, సాహిత్యం, సందేశం, విలువలు పలువురికి చాటి చెప్పే విధంగా తయారవుతాయి. ఇందులో కొందరు హరిదాసులైతే, మరికొందరు సంకీర్తన ఆచార్యులు. మరికొందరు వాగ్గేయకారులు. వారి వల్ల వారి సేవా నిరతి వల్ల, తాత్విక భజన సాంప్రదాయానికి నేటికీ ఇంత గొప్ప స్థానం లభించి సుస్థిరంగా ఉంది అని చెప్పడంలో ఎంత మాత్రమూ సందేహం లేదు.

ముగింపు:-

ఆధునిక మాయాజాలంలో సాంకేతికపరమైన ప్రభావం నేటి యువత పైన ఎక్కువగా ఉంది. అందువల్ల మానసిక ప్రశాంతతను స్థిర చిత్తమును దైవచింతనను అందించే ఈ భజన కీర్తనల సాంప్రదాయం ఎల్లప్పుడూ కొనసాగించవలసిన అవసరం ఎంతైనా ఉంది. అంతేకాకుండా మానవీయ సంబంధాలు, మానవతా విలువలు బోధించే ఎన్నో రకాల కీర్తనలు మనకు గోచరిస్తాయి. వాటి ద్వారా పట్టణాల వ్యామోహంలో పరుగులు తీస్తున్న ఈ యువతకు నేడు భజన కీర్తనల యొక్క గొప్పతనాన్ని చాటి చెప్పవలసిన అవసరం ఎంతైనా ఉన్నది.

అలా అయినప్పుడే ఆధ్యాత్మికతకు ఆలవాలమైన భారతదేశం యొక్క గొప్పతనం, భక్తి ఉద్యమం యొక్క ప్రాశస్త్యం, భజన కీర్తనల యొక్క విలువ ప్రపంచానికి తేటతెల్లమవుతాయి.

*ఆధార గ్రంథాలు:-

శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి జీవిత చరిత్ర
తారకామృత సారం భజన కీర్తనలు
శివరామ భజన కీర్తనలు
నరహరి కీర్తనలు
భక్త మధురం

—-------------------- 0 —-------------------